క్లుప్తంగా

నీటి నిల్వలు, చెత్త తొలగించాలి

డీపీఓ సుందరి



చాట్రాయి: గ్రామాల్లో పారిశుద్ధ్య పనులపై దృష్టి సారించాలని డివిజనల్ పంచాయతీ అధికారి సుందరి అన్నారు. పారిశుద్ధ్య పనులపై సమీక్షా సమావేశం పంచాయతీ కార్యదర్శులతో స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గ్రామాల్లో నీటి నిల్వలు, చెత్త కుప్పలు తొలగించాలని, ప్రతి వాటర్ ట్యాంకుని క్లోరినేషన్ చేయించాలని, పక్కా డ్రెయినేజీ, కచ్చా డ్రెయినేజీల్లో పూడికలు తీయించి వర్షం నీరు నిల్వ లేకుండా చూడాలని, ట్యాంకులు మరమ్మతులు చేయించి నీటి లీకేజీలు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మంగాకుమారి తదితరులు పాల్గొన్నారు.

మహిళల హక్కుల కోసం ఉద్యమిద్దాం

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): మహిళల హక్కుల కోసం ఉద్యమించాల్సిన తరుణం ఆసన్నమైందని ఐద్వా జిల్లా కార్యదర్శి డి.శ్రీదేవి అన్నారు. మహిళా హక్కుల కోసం పరితపించిన దివంగత మానికొండ సూర్యావతి వర్ధంతి కార్యక్రమం కొండపల్లిలో గురువారం జరిగింది. సూర్యావతి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆమె మాట్లాడుతూ విద్యలో వెనుకబాటు తనంతో మహిళలు అనేక అవమానాలు, అణచివేతకు గురవుతున్నారన్నారు. మహిళలకు విద్య, ఉపాధి అవకాశాలను ప్రభుత్వం కల్పించాలని డిమాండ్ చేశారు. కొండపల్లి శాఖ ఐద్వా అధ్యక్ష, కార్యదర్శులు పార్వతి, బేబీ సరోజినీ, మాజీ సర్పంచి వెనిగళ్ల అమ్మాజీ పాల్గొన్నారు.

విద్యాసంస్థల బంద్

తిరువూరు: జాతీయ స్థాయి పోటీ పరీక్షల నిర్వహణలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని ఆరోపిస్తూ విద్యార్థి సంఘాల పిలుపు మేరకు తిరువూరులో గురువారం పాఠశాలలు, కళాశాలలు మూసివేశారు. భారత విద్యార్థి ఫెడరేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రైవేటు, ప్రభుత్వ విద్యాసంస్థలను మూసివేయించిన అనంతరం విద్యార్థులు ప్రదర్శన జరిపారు.

నేడు ప్రజా దర్బార్

తిరువూరు: తిరువూరు నియోజకవర్గ ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు ఎమ్మెల్యే కె.శ్రీనివాసరావు శుక్రవారం ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహిస్తారని ఎమ్మెల్యే కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. ఎమ్మెల్యే నివాసం వద్ద ఉదయం 9 గంటల నుంచి ప్రజల వినతులను ఎమ్మెల్యే స్వీకరించి ఆయా శాఖల అధికారులకు సూచనలిస్తారన్నారు.

ఇరువురికి ప్రగతి స్కాలర్‌షిప్‌ల మంజూరు



బృందావని, సౌమ్య

తిరువూరు: స్థానిక శ్రీ వాహినీ ఇంజినీరింగ్ కళాశాలలో ఇద్దరు బీటెక్ విద్యార్థినులకు కేంద్ర ప్రభుత్వ ప్రగతి స్కాలర్‌షిప్‌లు మంజూరయ్యాయి. ఇంటర్మీడియెట్‌లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థినులకు ఏఐసీటీఈ మంజూరు చేసే ప్రగతి స్కాలర్‌షిప్‌లకు తమ విద్యార్థినులు తటవర్తి బృందావని, కొత్తపల్లి సౌమ్య ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ రంగా నాగేంద్రబాబు తెలిపారు. విద్యార్థినులను కళాశాల చైర్మన్ పసుమర్తి వెంకటేశ్వరరావు, కార్యదర్శి ఊటుకూరు సుబ్రహ్మణ్యం, కరస్పాండెంట్ పోట్రు నాగేశ్వరరావు, కోశాధికారి కిషోర్‌బాబు అభినందించారు.

ఉపాధ్యాయులు సమయ పాలన పాటించాలి

తోటమూల(గంపలగూడెం): ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని ఎంఈఓ-1 శ్యామ్‌సుందరరావు అన్నారు. తోటమూల ఎలిమెంటరీ పాఠశాలను ఎంఈఓ-1 శ్యామ్‌సుందరరావు గురువారం పరిశీలించారు. పాఠశాలలో రికార్డులను, విద్యార్థుల హాజరు శాతాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు సులభరీతిన అర్థమయ్యేలా ఉపాధ్యాయులు బోధించాలన్నారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, మెనూ సక్రమంగా పాటించాలని, రుచిగా, శుచిగా ఆహారం తయారు చేసి విద్యార్థులకు అందజేయాలని వంట ఏజెన్సీ మహిళలకు సూచించారు. ప్రధానోపాధ్యాయులు షేక్ యాకూబ్ పాల్గొన్నారు.

వేధింపుల భర్తపై కేసు నమోదు

ముసునూరు: భార్యను శారీరకంగా, మానసికంగా హింసిస్తున్న భర్తపై ముసునూరు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్‌ఐ పి.వాసు తెలిపిన వివరాల ప్రకారం.. అక్కిరెడ్డిగూడెంకు చెందిన నాగలక్ష్మి (28)కి ద్వారకా తిరుమల మండలం శాయనపాలెంకు చెందిన నల్లపోగు గంగరాజు(38)తో పదేళ్ల కిందట వివాహమైంది. వీరికి ముగ్గురు పిల్లలు. వేరే మహిళలతో వివాహేతర సంబంధాలకు అలవాటు పడిన గంగరాజు భార్యను శారీరకంగా, మానసికంగా హింసించడం ప్రారంభించాడు. ఈ నేపథ్యంలో గత నెల 26వ తేదీ రాత్రి నాగలక్ష్మిపై కర్రతో దాడి చేయడంతో ఆమె తీవ్రంగా గాయపడింది. బంధువులు ఆమెను నూజివీడు ఏరియా ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతోంది. గురువారం ఆస్పత్రి నుంచి అందిన సమాచారం మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

నాన్ స్టాప్ సర్వీసుల కోసం ఎదురుచూపు

- నగానికి పైగా తగ్గిపోయిన సర్వీసులు
- సిటీ సర్వీసులను ఆశ్రయిస్తున్న ప్రజలు
- ప్రయాణికుల ఇబ్బందులు
- సత్తుపల్లి బస్సులతో డిపో ఆదాయానికి గండి



నాన్ స్టాప్ బస్సు కోసం ఎదురుచూస్తున్న ప్రయాణికులు

నూజివీడు: నూజివీడు ఆర్‌టీసీ డిపోలో నాన్ స్టాప్ బస్సు సర్వీసులను తగ్గించారు. సగానికి పైగా సర్వీసులు తగ్గిపోయాయి. నూజివీడు నుంచి విజయవాడకు వెళ్లేందుకు ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. నాన్ స్టాప్ సర్వీసుల కోసం ఎదురు చూసి చేసేది లేక సిటీ సర్వీసులను ఆశ్రయిస్తున్నారు. మరికొందరు తెలంగాణ రాష్ట్రం సత్తుపల్లి డిపో బస్సులలో ప్రయాణిస్తున్నారు. దీంతో నూజివీడు డిపో ఆదాయానికి గండిపడుతోంది.

ఐదు సర్వీసులకు పరిమితం..

గతంలో నూజివీడు నుంచి విజయవాడకు పది నుంచి 12 సర్వీసులు నడవగా, నేడు అవి కేవలం 5 సర్వీసులకు పరిమితమయ్యాయి. ఒకప్పుడు ప్రతి పావుగంటకొక నాన్‌స్టాప్ సర్వీసు ప్రజలకు అందుబాటులో ఉండేది. రోజుకు రూ.80 వేల నుంచి రూ.90 వేల రెవెన్యూ వస్తూ నాన్‌స్టాప్ సర్వీసులే డిపోకు ఆదాయ వనరుగా ఉండేవి. అయితే ఏలూరు జిల్లాలో డిపోను కలిపిన నాటి నుంచి నూజివీడు డిపోలో నాన్‌స్టాప్ సర్వీసులను తగ్గిస్తూ వచ్చారు. ఒకప్పుడు ప్రతి పావు గంటకు ఉన్న సర్వీసు నేడు ఒక్కొక్కసారి గంట సేపు వేచి ఉన్నా నాన్ స్టాప్ బస్సులు ఉండటం లేదు. నాన్ స్టాప్ బస్సులు ఎప్పటికి వస్తాయో తెలియని పరిస్థితుల్లో విజయవాడ వెళ్లాల్సిన ప్రయాణికులు తెలంగాణ రాష్ట్రం సత్తుపల్లి డిపోకు చెందిన బస్సుల్లో, ప్రైవేటు వాహనాల్లో వెళ్లాల్సి వస్తోంది. ఇలా మన రాష్ట్ర ఆదాయం పక్క రాష్ట్ర డిపోకు వెళుతున్నా ఆర్టీసీ అధికారుల్లో మాత్రం చలనం లేదని ప్రయాణికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడు కేవలం ఐదు బస్సులు మాత్రమే నడుస్తుండటంతో రోజుకు రూ.30 వేల రెవెన్యూ రావడం కూడా కష్టతరంగా ఉందని ఆర్టీసీ వర్గాలే పేర్కొంటున్నాయి.

సర్వీసులు పెంచకుంటే డిపో మనుగడ ప్రశ్నార్థకం..

విజయవాడ జోన్ పరిధిలో ఉన్నంత కాలం నాన్ స్టాప్ సర్వీసులు బాగానే నడిచాయని, ఏలూరు జోన్ పరిధిలోకి డిపో వెళ్లిన తరువాత అక్కడి ఉన్నతాధికారుల వైఖరి వల్ల నాన్ స్టాప్ సర్వీసులు తగ్గాయని సిబ్బంది చెబుతున్నారు. దీనికి తోడు నూజివీడుకు వచ్చిన నూతన బస్సులను, కండీషన్‌లలో ఉన్న బస్సులను ఇక్కడ నుంచి వేరే డిపోలకు పంపి, కాలం చెల్లిన బస్సులను ఈ డిపోకు పంపుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రెవెన్యూ వచ్చే రూట్లలో సర్వీసులను పెంచుకొని ఆదాయాన్ని పెంచుకోకపోతే రాను రాను డిపో మనుగడ ప్రశ్నార్థకం కావడం ఖాయమనే ఆందోళన వ్యక్తమవుతోంది.

త్వరలోనే సర్వీసులు పెంచుతాం

ఉదయం 11 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి సర్వీసు ఎక్కువగా ఉంటోంది. మధ్యాహ్న సమయంలో సర్వీసు తక్కువగా ఉంటోంది. పరిస్థితిని పరిశీలించిన అనంతరం త్వరలోనే నాన్ స్టాప్ సర్వీసులను పెంచేందుకు చర్యలు తీసుకుంటాం.

– సీహెచ్‌ఎస్ పవన్‌కుమార్, డిపో మేనేజర్, నూజివీడు

కుటిల రాజకీయాలు మానుకోవాలి

ఎమ్మెల్యేకి స్వామిదాసు హితవు



విలేకరులతో మాట్లాడుతున్న స్వామిదాసు

తిరువూరు: ప్రశాంతంగా ఉన్న తిరువూరు నియోజకవర్గంలో రాజకీయ కక్షలతో కలుషితం చేయవద్దని ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావుకు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు హితవు పలికారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎ.కొండూరు మండలం కంభంపాడులో అక్రమ కట్టడాల నిర్మూలన పేరుతో తనకు లేని అధికారాలను వినియోగించుకుని ప్రజలను భయభ్రాంతులకు గురిచేసిన ఎమ్మెల్యే శ్రీనివాసరావు ప్రజాహితం కోసం పనిచేయాలని సూచించారు. తిరువూరు నియోజకవర్గంలో ఇంతవరకు రాజకీయ కక్షలతో దాడులు చేసిన ఘటనలు లేవని, తాను 30 ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్నానని, ఎప్పుడూ ఇటువంటి ఎమ్మెల్యేని చూడలేదని స్వామిదాసు అన్నారు. కంభంపాడులో అక్రమ కట్టడాలున్నట్లు ఎవరూ ఫిర్యాదు చేయకపోయినా ఎమ్మెల్యే కుటిల రాజకీయాలతో నానా హడావుడి చేయడం, గ్రామంలో ఇళ్లపై వైఎస్సార్ సీపీ జెండాలు తొలగించడం, కూటమి నాయకులు దౌర్జన్యాలకు పాల్పడటం హేయమన్నారు. ఎన్నికల సమయంలో ఎంపీపీ భర్త చెన్నారావు ఆయన అనుచరులు తమపై దాడి చేశారంటూ తప్పుడు ఫిర్యాదు చేసి వారిని అరెస్టు చేయాలని ఒత్తిడి చేయడం శోచనీయమన్నారు. వెనుకబడిన తరగతులకు చెందిన చెన్నారావును అభాసుపాలు చేయడమే ధ్యేయంగా ఎమ్మెల్యే దురుద్దేశంతో దౌర్జన్యపూరితంగా వ్యవహరించారని ఆరోపించారు. బీసీ నేతను మానవ మృగంగా అభివర్ణించడం, పొక్లెయిన్‌తో భవనాలు కూల్చడం, నడిరోడ్డుపై వీరంగం వేయడం ఎమ్మెల్యే శ్రీనివాసరావుకే చెల్లిందన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకిచ్చిన వాగ్దానాలను నెరవేర్చడంపై ఎమ్మెల్యే దృష్టి సారించాలన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పేదలకు ఇచ్చిన వాగ్దానాలన్నీ అమలు చేసినా ప్రజలు ఎన్నో ఆశలతో తెలుగుదేశం పార్టీని గెలిపించారని, హామీలన్నీ నెరవేర్చాలని డిమాండ్ చేశారు. అబద్ధాలతో కాలక్షేపం చేయవద్దని, తాము ఎటువంటి పరిణామాలనైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని స్వామిదాసు హెచ్చరించారు. కంభంపాడులో ప్రభుత్వ భవనాలు ఆక్రమించి పక్కా భవనాలు నిర్మించిన ఘనత తెలుగుదేశం నేతలదేనని, ఈ అక్రమాలను తాము వెలికితీస్తామని చెప్పారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకున్న ఎమ్మెల్యేపై ప్రజలు తిరగబడే రోజు దగ్గరలోనే ఉందన్నారు. తమ సహనాన్ని అసమర్థతగా భావించవద్దని చెప్పారు.

అభివృద్ధికి ఐక్యంగా ముందుకు సాగుదాం

మంత్రి కొలుసు పార్థసారథి



కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పార్థసారథి

నూజివీడు: రాజకీయాలను పక్కనపెట్టి నూజివీడు పట్టణంతో పాటు నియోజకవర్గ అభివృద్ధికి అందరం కలిసికట్టుగా ముందుకు సాగుదామని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. ఎక్స్ అఫీషియో సభ్యునిగా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం మున్సిపల్ చైర్‌పర్సన్ రామిశెట్టి త్రివేణీదుర్గ అధ్యక్షతన నిర్వహించిన కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలోనే రాజకీయాలు మాట్లాడుకోవాలి తప్పితే మిగిలిన సమయంలో అభివృద్ధిపైనే దృష్టి సారించాలన్నారు. పట్టణంలో ట్రాఫిక్ ఇబ్బందులు ఎక్కువగా ఉన్నాయని, దీనిని పరిష్కరించేందుకు గాను మైలవరం రోడ్డు నుంచి విస్సన్నపేట రోడ్డుకు బైపాస్ నిర్మాణానికి భూమి సర్వే చేయమని అధికారులకు చెప్పానన్నారు. అండర్‌గ్రౌండ్ నిర్మాణానికి డీపీఆర్ తయారు చేసిన తరువాత అవసరమైతే కేంద్ర ప్రభుత్వం నుంచి కూడా నిధులు మంజూరయ్యేలా కృషి చేస్తానని చెప్పారు. పట్టణ శివారులోని బృందావన పార్కును అభివృద్ధి చేయడానికి చర్యలు తీసుకున్నామన్నారు. మంచినీటి సమస్య పదేపదే తలెత్తకుండా సమ్మర్ స్టోరేజీ ట్యాంక్‌ను నిర్మించాల్సి ఉందన్నారు. పాలడుగు వెంకట్రావు ప్రారంభించిన ఇండోర్ స్టేడియం నిర్మాణ పనులను నిధులను మంజూరు చేయించి ఏడాదిలో పూర్తి చేయిస్తామని చెప్పారు. సమావేశంలో పలు వర్కులకు సంబంధించిన తీర్మానాలను ఆమోదించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ఆర్. వెంకటరామిరెడ్డి, డీఈ లక్ష్మీనారాయణ, వైస్ చైర్మన్ కొమ్ము వెంకటేశ్వరరావు, కో-ఆప్షన్ సభ్యుడు రామిశెట్టి మురళీకృష్ణ, లాం ప్రసాదరావు, ప్రతిపక్ష ఫ్లోర్ లీడర్ చెరుకూరి దుర్గాప్రసాద్, పలువురు అధికారులు పాల్గొన్నారు.

ఎక్స్ అఫీషియో సభ్యుడిగా ప్రమాణ స్వీకారం

నూజివీడు: నూజివీడు మున్సిపాలిటీ ఎక్స్ అఫీషియో సభ్యుడిగా గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి గురువారం ప్రమాణస్వీకారం చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ అధ్యక్షతన కౌన్సిల్ సమావేశాన్ని మంత్రితో మున్సిపల్ కమిషనర్ ఆర్.వెంకటరామిరెడ్డి ప్రమాణ స్వీకారం చేయించారు.

ఆదర్శప్రాయుడు అల్లూరి సీతారామరాజు





మైలవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్, విద్యార్థులు : ఇబ్రహీంపట్నంలో నివాళులర్పిస్తున్న ఎన్టీటీపీఎస్ సీఈ నాగరాజు

మైలవరం: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజును యువత, విద్యార్థులు ఆదర్శంగా తీసుకుని భావి తరాలను తీర్చిదిద్దాలని ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి అన్నారు. మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ భారత దేశ స్వాతంత్ర్య పోరాటంలో విప్లవ మార్గాన్ని అనుసరించి పోరాటం చేసిన వీరుల్లో అల్లూరి సీతారామరాజు అగ్రగణ్యుడని ప్రశంసించారు. బ్రిటిష్ వారి తూటాలకు భయపడకుండా ఎదురొడ్డి పోరాడాడన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పురంశెట్టి రంగారావు, చరిత్ర విభాగం అధ్యాపకులు శ్రీనివాసరావు, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

అల్లూరి సీతారామరాజుకు ఘన నివాళి

ఇబ్రహీంపట్నం: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి కార్యక్రమం స్థానిక ఎన్టీటీపీఎస్‌లో గురువారం నిర్వహించారు. సంస్థ చీఫ్ ఇంజినీర్ టి.నాగరాజు పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ అచంచలమైన దేశభక్తి కలిగిన వ్యక్తి అల్లూరి సీతారామరాజు అని అన్నారు. గిరిజనుల హక్కుల కోసం బ్రిటిష్ వారితో అలుపెరుగని పోరాటం చేశాడని చెప్పారు. 27ఏళ్ల వయస్సులో దేశం, ప్రజల కోసం ప్రాణాలు విడిచారని వివరించారు. కార్యక్రమంలో ఎస్ఈలు నాగేశ్వరరావు, తిరుమల ప్రసాద్, మల్లికార్జునరావు, అనూరాధ, సాంబశివరావు, భాస్కరరావు, శాస్త్రి, సుశీల తదితరులు పాల్గొన్నారు.

- చాట్రాయి: మండలంలోని చిన్నంపేట గ్రామంలో గురువారం అల్లూరి సీతారామరాజు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిద్ధార్థ హైస్కూల్ విద్యార్థులు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి కొమ్ము ఆనందం తదితరులు పాల్గొన్నారు.
- పెనుగొలను(గంపలగూడెం): పెనుగొలను శాఖా గ్రంథాలయంలో మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతిని గురువారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బ్రిటిష్ వారితో ఆయన జరిపిన పోరాటాన్ని ఈ సందర్భంగా గుర్తుచేసుకొన్నారు. గ్రంథాలయ నిర్వహణాధికారి శ్రీలత, ఉపాధ్యాయులు ఎ. నరసింహారావు, రంగమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.
- తిరువూరు: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు యువతకు ఆదర్శప్రాయుడని తిరువూరు గ్రేడ్ 1 శాఖా గ్రంథాలయాధికారి కొరివి పద్మావతి అన్నారు. గురువారం అల్లూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. లక్ష్యం కోసం నిబద్ధతతో కృషిచేయడం యువత అలవరచుకోవాలని ఆమె సూచించారు. పాఠకులు, సిబ్బంది పాల్గొన్నారు. తిరువూరు నగర పంచాయతీ కార్యాలయంలో అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి ఎమ్మెల్యే శ్రీనివాసరావు, నగర పంచాయతీ చైర్‌పర్సన్ గత్తం కస్తూరిబాయి, కౌన్సిలర్లు పూలమాల వేసి నివాళులర్పించారు. పలువురు వక్తలు అల్లూరి ఖ్యాతిని కొనియాడారు.
- నూజివీడు: నూజివీడు మున్సిపల్ కార్యాలయంలో అల్లూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మున్సిపల్ కార్యాలయ మేనేజర్ మనోజ మాట్లాడుతూ అల్లూరి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నరసింహారావు, సిబ్బంది పాల్గొన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో అల్లూరి చిత్రపటానికి కార్యాలయ ఏఓ బేబీ పూలమాల వేసి నివాళులర్పించారు. ఏపీఓ సోమేశ్వరి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పాత పంట కాలువపై సిమెంట్ దిమ్మెలు అమర్చాలి

భవానీపురం(విజయవాడపశ్చిమ): విజయవాడ రూరల్ మండలం రాయనపాడు గ్రామంలో వినియోగంలో లేని పాత పంట కాలువపై సిమెంట్ దిమ్మెలు వేయాలని గ్రామానికి చెందిన సీహెచ్ దాసు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన జిల్లా కలెక్టర్ డాక్టర్ సృజనను కలిసి వినతిపత్రం అందచేశారు. గ్రామంలోని రెండు ఎస్సీ కాలనీల మధ్య ఉన్న పాత పంట కాలువ గత పదేళ్లకుపైగా నిరుపయోగంగా ఉందని దాసు తెలిపారు. అందులో మురికినీరు చేరి చెత్తాచెదారంతో నిండిపోయిందని వినతి పత్రంలో పేర్కొన్నారు. మురుగులో ఉత్పత్తి అవుతున్న దోమల కారణంగా ప్రజలు మలేరియా, డయేరియ వ్యాధుల బారినపడి అనారోగ్యంతో బాధపడుతున్నారని దాసు కలెక్టర్‌కు వివరించారు. వినియోగంలోలేని పాత పంట కాలువకు రెండు వైపులా రక్షణ లేకపోవడంతో గతంలో ఒక బాలుడు, పశువులను కాసే ఒక యువకుడు అందులోపడి మృతిచెందారని చెప్పారు. సంబంధిత అధికారులకు పలుమార్లు వినతి పత్రాలు సమర్పించినా స్పందన లేదన్నారు. సమస్యను పరిష్కరించాలని కోరారు.

రాజకీయాలకతీతంగా అభివృద్ధికి కృషి

తిరువూరు ఎమ్మెల్యే శ్రీనివాసరావు



అధికారులు, కౌన్సిలర్లతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

తిరువూరు: రాజకీయాలకతీతంగా తిరువూరు నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని తిరువూరు ఎమ్మెల్యే కె. శ్రీనివాసరావు అన్నారు. తిరువూరు నగర పంచాయతీలో నెలకొన్న పలు సమస్యలపై వార్డు కౌన్సిలర్లు, అధికారులతో గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు కౌన్సిలర్లు మాట్లాడుతూ పట్టణంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉన్నందున కృష్ణా జలాలను సరఫరా చేసే పైలట్ ప్రాజెక్టు పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. ఇప్పటికే ఈ పనులు ప్రారంభమైనప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంట్ చెల్లిస్తేనే కేంద్రం నిధులు విడుదల చేస్తుందని తెలిపారు. తదనుగుణంగా ప్రభుత్వం నుంచి నిధుల మంజూరుకు తాను కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. చైర్‌పర్సన్ గత్తం కస్తూరిబాయి, కమిషనర్ లోవరాజు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

రంగా స్ఫూర్తితో పేదలకు సేవలు

ఎమ్మెల్యే వసంత, వంగవీటి రాధా



మైలవరంలో రంగా విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వసంత, వంగవీటి రాధా తదితరులు



కొండపల్లిలో నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

మైలవరం: దివంగత ఎమ్మెల్యే వంగవీటి మోహనరంగా స్ఫూర్తితో పేదలకు సేవలు అందించాలని, అదే ఆయనకు మనమిచ్చే నివాళి అని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్, వంగవీటి రాధా అన్నారు. వంగవీటి మోహన రంగా జయంతి కార్యక్రమం రాధా రంగా మిత్రమండలి ఆధ్వర్యంలో గురువారం మైలవరంలో నిర్వహించారు. రంగా విగ్రహానికి, మదర్ థెరిస్సా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అన్నదానం చేశారు. మైలవరం నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి అక్కల రామ్మోహనరావు, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నూతలపాటి బాలకోటేశ్వరరావు, బొప్పన భవకుమార్ తదితరులు పాల్గొన్నారు.

- కొండపల్లి(ఇబ్రహీంపట్నం): వంగవీటి మోహనరంగా పేదల పక్షపాతి అని వైఎస్సార్ సీపీ కొండపల్లి పట్టణ అధ్యక్షుడు మిక్కిలి శరభయ్య అన్నారు. కొండపల్లిలో వీఎం మోహనరంగా జయంతి కార్యక్రమం గురువారం నిర్వహించారు. రంగా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ పట్టణ మాజీ అధ్యక్షుడు ఎంఏ బేగ్, కార్మిక నాయకుడు మోహనరావు, మాజీ ఎంపీటీసీ కె.శ్రీనివాసరావు, పలనాటి బాలచందర్, చందా చంటి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.
- మైలవరం: మైలవరం బోసు బొమ్మ సెంటర్‌లో రంగా చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ నాయకులు శీలం రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.
- ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం, కొండపల్లిలో మోహనరంగా జయంతి కార్యక్రమంలో రంగా తనయుడు వంగవీటి రాధతో కలిసి ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు. రంగా విగ్రహానికి నివాళుర్పించారు. దివ్యాంగుల సంస్థలో నిత్యావసరాలు పంపిణీ చేశారు.
- నూజివీడు: పేదల కోసం పాటుపడిన కాపు నేత దివంగత వంగవీటి మోహన్‌రంగా అని మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యుడు రామిశెట్టి మురళీకృష్ణ అన్నారు. వంగవీటి మోహన్‌రంగా జయంతి కార్యక్రమం రాధా,రంగా మిత్ర మండలి నాయకులు రావి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో పెద్ద గాంధీ బొమ్మ సెంటర్‌లో నిర్వహించారు. వైఎస్సార్ సీపీ యువజన నాయకులు కొండా వెంకటరావు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పంచిపెట్టారు. రంగా విగ్రహానికి, చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు శీలం రాము, మలిశెట్టి బాబీ, కొండా వెంకట్రావు, మేకల అనిల్, పగడాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు

మంత్రి కొలుసు పార్థసారథి



మాట్లాడుతున్న మంత్రి పార్థసారథి

చాట్రాయి: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖా మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. చీపురుగూడెంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని గురువారం ఆయన పరిశీలించారు. గ్రామంలో జ్వరాల పరిస్థితిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలోని ట్యాంకులను క్లోరినేషన్ ఎందుకు చేయించడం లేదు.. డ్రెయినేజీల్లో పూడిక తీత పనులు ఎందుకు చేయించడం లేదని అధికారులను ప్రశ్నించారు. త్వరితగతిన పారిశుద్ధ్య పనులు చేపట్టి ఆరోగ్యకరమైన గ్రామాలుగా తీర్చిదిద్దాలని సూచించారు. కార్యక్రమంలో ఏలూరు డీఎంహెచ్‌ఓ శర్మిష్ట, డిస్ట్రిక్ట్ డిసీజ్ సర్వైకల్ అధికారి డాక్టర్ నరేంద్ర, ఎంపీడీఓ మంగా కుమారి, తహసీల్దార్ మహ్మద్ మసూద్ ఆలీ, పీహెచ్‌సీ వైద్యులు శ్రీనివాసరెడ్డి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

అసమాన ప్రజ్ఞావంతుడు రోశయ్య



రోశయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

తిరువూరు: దివంగత ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య ఏ పదవిలోనైనా తనదైన శైలిలో విశేష ఖ్యాతి గడించారని తిరువూరు ఆర్యవైశ్య సమాజం అధ్యక్షుడు గుడిమెట్ల మురళి అన్నారు. రోశయ్య జయంతి కార్యక్రమం తిరువూరు ఆర్య వైశ్య కల్యాణ మండపంలో గురువారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి ఆర్య వైశ్య సంఘ సభ్యులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మురళి మాట్లాడుతూ అసమాన ప్రజ్ఞావంతుడు రోశయ్య అని అన్నారు. ముఖ్యమంత్రిగా, గవర్నర్‌గా, ఆర్థిక శాఖా మంత్రిగా ఆయన ప్రత్యేకతను చాటుకున్నారని వివరించారు. సంఘ సభ్యులు దోసపాటి రవికుమార్, దారా హరిబాబు, చిత్తలూరి నరసింహరాజు, జూలూరి వెంకట రమణయ్య, నాళ్లా రాజారావు, నాళ్లా రామారావు, నాళ్లా సూర్యప్రకాశరావు, భూమా కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై దృష్టి సారించాలి



జి.కొండూరు: వర్షాలు పడుతున్న నేపథ్యంలో వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు స్వచ్ఛమైన తాగునీటి సరఫరా, నిరంతర పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని ఎంపీపీ వేములకొండ లక్ష్మీతిరుపతమ్మ అన్నారు. స్థానిక కమ్యూనిటీ హాల్‌లో మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ వేములకొండ లక్ష్మీతిరుపతమ్మ అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా గతంలో నిధులు కేటాయించిన అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై అధికారులు, ప్రజాప్రతినిధులతో ఎంపీపీ చర్చించారు. శాఖల వారీగా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా రాయితీపై విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను పంపిణీ చేయాలని సూచించారు. పరిసరాల పరిశుభ్రతపై గ్రామీణ ప్రాంత ప్రజలకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తూ అవసరమైన మందులను పంపిణీ చేయాలని, డ్రెయినేజీలలో దోమ లార్వా పెరగకుండా బ్లీచింగ్ చల్లించాలని, మందులను పిచికారీ చేయించాలని చెప్పారు. గ్రామాలలో ఉన్న సమస్యలను అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు చర్యలు చేపడతామని ఎంపీపీ వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసరావు, తహసీల్దార్ నరసింహారావు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.